# కొత్త గొంతుక



తూర్పు కనుమల్లో సూర్యుడు ఉదయించాడు. పచ్చనిచెట్లు ఆకులతో కళకళలాడుతున్నాయి. పక్షులన్నీ స్వేచ్ఛగా తిరుగుతున్నాయి. ఎప్పుడూ ప్రశాంతతకు నిలయమైన ఆ కొండ కోనల్లో నివసించే గిరిజన మన్యంలో కలకలం రేగింది. నాగరిక సమాజానికి దూరంగా వున్న గ్రామం అది. అకస్మాత్తుగా రాత్రికి రాత్రే అమాయక మన్యం స్త్రీలపై దాడి జరిగింది. భయం అంటే ఎరుగని ఆ మన్యం ప్రజల జీవితాలు చిగురుటాకుల్లా వణికాయి. గూడెం నివాసులంతా ఆందోళన చెందుతూ ఒక చోట గుమిగూడారు. ముందు రోజు జరిగిన దుస్సంఘటనతో కలత చెందిన వారంతా కోపావేశంతో వణికిపోసాగారు.

'యింత ఘోరం జరిగాక కూడా తలదించుకోవాల్సిన పనిలేదు' అన్నాడు మన్యం దొర అన్యమనస్కంగా...

'ఆ దుర్మార్గుల్ని ఊరికే వదిలిపెట్టేదిలేదు' ఆవేశం కట్టలు తెంచుకుంది.

'ఎవరి కోసమో వచ్చి, అన్నెం పున్నెం ఎరుగని మన ఆడోళ్ల మీదనా ప్రతాపం చూపిస్తారు దొంగనా కొడుకులు' పళ్ళు పటపట కొరుకుతూ గొంతు చించుకున్నట్లు అరిచాడు.

ఆ వూరి పెద్ద ఒకడుగు ముందుకేస్తూ,

'మరెందుకు ఆలస్యం , పదండి! ఆళ్ళ పనిచెపుదాం. పిటిషన్ పెడితే సరి ..' అంటూ హుంకరించాడు.

'దొరకాలే కానీ నరికిపోగులు పెట్టనా' చింతన్న శివతాండవం చేసిన వాడిలా పిడికిలి బిగించాడు. తనకి జరిగిన అన్యాయాన్ని, ఘోరాన్ని తలచుకుంటూ...

'చింతన్నా అవేశపడకు, చిలకమ్మ నా కూతురు లాంటిది, నీకు జరిగితే ఒకటా, నాకు జరిగితే మరొకటా...;? తలతెగినంత ఘోరం జరిగాక,...' అంటూ భుజం తట్టి కంటతడిపెట్టాడు. చింతన్న కళ్ళల్లో కన్నీటి జలపాతం ఉప్పొంగింది. ఒకరినొకరు పరామర్శించు కుంటూ బుజ్జగించుకున్నారు. పగతో, బాధతో మగవారి గుండెలు మండిపోసాగాయి. తమ చేతగాని తనానికి తలవంచి సిగ్గుపడ్డారు. చింతన్న కళ్ళు చింత నిప్పుల్లా మండాయి.

' అసలేం జరిగిందో తెలుసా మీకు? నా గుండె తరుక్కుపోతుంది....'అంటూ అక్కడ మూగిన జనంలో నుండి చిరుతపులిలా ఘీంకరించాడు.

'పొద్దు పోతుందని, యింట్లో ఒంటరిగా వున్న చిలకమ్మ దీపం పెట్టబోతుంటే, అదెప్పుడు చొరబడ్డారో, మాటువేసి, తుపాకులు చూపించి, ఛీ ఛీ చెప్పుకుంటే నామోషి, దాన్నిప్పుడు ఇంట్లో పెట్టుకోవాలా.. వద్దా ? చెప్పండి..! అన్నాడు కళ్ళల్లో చంద్రనిప్పులు కురిపిస్తూ, అంతా కళ్ళింతలు చేసుకుంటూ,నోళ్ళు చాచి, ఊపిరి బిగబట్టి విన్నారు. అక్కడంతా నిశ్శబ్దం తాండవిస్తోంది. అంతలో సత్తిబాబు తననెవరో సూదుల్తో పొడుస్తున్నట్లు విలవిలలాడిపోతూ,

'ఛీ ...యమ్మ...బాలింతని కూడా చూడలేదు...పుట్టిన బిడ్డ దక్కక పుట్టెడు దు:ఖంతో వున్న దాన్ని కూడా వదల్లేదు. నా ఆలిని ఇప్పుడెట్లా యేలు కుంటా....' రక్తం సలసలకాగుతున్న వాడిలా ఊగిపోయాడు.

కలకలం రేగింది.. ఆడవాళ్ళపై జరిగిన దౌర్జన్యాన్ని అంతా ఏకరవు పెట్టుకొని బావురుమని ఏడ్వసాగారు.

‘ మా ఆడదాని చేతి నీళ్ళు ముట్టుకోను. అంతే!’ అంటూ వెర్రివాడిలా మరొకడు నెత్తినోరు కొట్టుకున్నాడు. గూడెం గురవయ్య నిర్ఘాంతపోయాడు. అంతా ఒక్కఉదుటున లేచి పంచాయతీ ఆఫీసుకు బయలుదేరారు. జరిగింది మొరపెట్టుకున్నారు. కాగితం మీద వేలిముద్రలు వేయించుకొని టూటౌన్‌కి పిటిషన్ యిచ్చారు.

వార్త వెలుగులోకి వచ్చింది. మహిళా ఉద్యమ సంఘాలు హుటాహుటిన ఈ దుశ్చర్యను ఖండిస్తూ గిరిజన ప్రాంతానికి చేరుకున్నారు. గూడెం ప్రజలు నోరు తెరిచి చెప్పుకోలేని స్థితి. మతిచలించిన వారిలా మూగభాషతో సరిపెట్టుకుందామన్నట్లు వెర్రి చూపులు చూడసాగారు.

‘ అత్యాచారం జరిగిందని ధైర్యంగా చెప్పండి...’

‘ మీ ఆడవాళ్ళు తిరగబడలేదా? మీకెలా తెలిసింది? దోషుల్ని గుర్తుపట్టగలరా?’ వీరడిగిన ప్రశ్నలకు అంతా గుడ్లప్పగించి పిచ్చిచూపులు చూడసాగారు. మహిళా సంఘాలు పోటీపడి ఫోటోలు తీయించుకున్నారు. ఆ సాయింత్రం ఓ అధికారి జీపులో వచ్చాడు.

‘ ఎవరయ్యా యిక్కడ కంప్లైంట్ ఇచ్చింది..?వాళ్ళంతా ఐ మీన్.... ఆడవాళ్ళంతా జీపు ఎక్కండి ...మెడికల్ టెస్ట్ చేయాలి. పై నుండి ఆర్డర్ వచ్చింది. ఊ...కమాన్... క్విక్...! అన్నాడు.

ఈ హఠాత్పరిణామానికి అందరిలో అలజడి రేగింది. ఎవరి మాట వినకపోతే ఏమవుతుందోనని ఒక్కొక్కరు తలవంచుకొని జీపెక్కారు తప్పు చేసిన వారిలా... చిలకమ్మ ఎక్కడికి వెళ్ళిందోకనబడలేదు. ఆమెను పిలిచే లోపున జీపు ఊరి పొలిమేర దాటిపోయింది. దారిలో ఆఫీసర్ సెల్ మ్రోగింది.

‘హలో..! అంతా జీపెక్కారా...ఏమైనా బెట్టుచేశారా..?

‘నో సార్! అంతా నోరెత్తకుండా ఎక్కేసారు...’

‘గుడ్! దారిలో నర్సింగ్‌హోమ్‌లో ఈ రోజంతా డిటైన్ చేయండి...’

‘ అదేంటి సార్?’

‘ అది కాదయ్యా...మెడికల్ టెస్ట్‌లు లేట్‌గా చేస్తేనే కదా రిపోర్టులు తారుమారయ్యేది. చెప్పింది చేయ్. నేను టచ్‌లో వుంటాను. ప్రొసీడ్...’

“ ఎస్సార్.....”

అంతే! జీపు దారిమళ్లింది.

మరోవైపు రాజకీయ నాయకుల సందడి మొదలైంది. పోటీగా అధికార పక్షం అన్నింటిని ఖండిస్తూ, అదంతా ప్రతిపక్షాల కుట్ర అని జమకట్టింది.

మన్యం ప్రజలకు మద్దతుగా రాస్తారోకోలు, బంద్‌లు మొదలయ్యాయి.

తప్పుడు నివేదిక సృష్టించారంటూ దుయ్యబట్టారు. ఆందోళనలు ఉధృతం చేశారు.

మరో వైపు ప్రజాహక్కుల వేదిక బాధితుల తరపున న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. తగినన్ని సాక్ష్యాధారాలు ప్రవేశపెట్టినందుకు కేసు కొట్టేసారు.

అలజడులు, ఆందోళనలు, పోరాటాలు, సభలు, లాఠీచార్జీలు, అన్నీ మెల్లమెల్లగా సద్దుమణిగాయి.

గూడెంలో చిలకమ్మ ఎక్కడికీ తప్పిపోలేదు. దెబ్బతిన్న చిలకమ్మ తొమ్మిది నెలలకు బిడ్డను ప్రసవించింది. వైద్యం అందక తను మాత్రం కన్నుమూసింది.

గూడెంలో కొత్త గొంతుక విచ్చుకుంది. ఊరంతా ఉలిక్కిపడింది. అంతా ఏకమయ్యారు. ఆ పసికందు రూపురేఖలు, ఆనవాలు చూసాక ఏదో అనుమానం తలెత్తింది. ఊరంతా కదిలింది పోలీసు ఠాణాకి. దాచినా దాగని నిజాన్ని కప్పిపుచ్చాలనుకున్న వారందరికీ 'కొత్త గొంతుక' అలజడి రేపింది.

– (ముంబయ్ వన్, నవంబర్, 2010)